ప్రజాశక్తి
మంగళవారం 19 నవంబర్ 2024
5
విజయనగరం



20న జాబ్‌మేళా

ప్రజాశక్తి-విజయనగరంకోట

రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉపాధికల్పనలో భాగంగా టెన్త్, ఇంటర్, ఐటిఐ, డిగ్రీ ఉత్తీర్ణత సాధించిన వయస్సు 18 నుండి 35 ఏళ్ల వయసుగల నిరుద్యోగ యువతకు ఈనెల 20 జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి జి.ప్రశాంత్ కుమార్ తెలిపారు. విటి అగ్రహారంలోని ప్రభుత్వ ఐటిఐలో ఉదయం 9గంటల నుంచి జాబ్‌మేళా జరుగుతుందని పేర్కొన్నారు. జాబు మేళాకు హెటిరో ఫార్మాస్యూటికల్, ఎల్.జి ఎలక్ట్రానిక్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ మొదలగు బహుళ జాతి కంపెనీలు హాజరై అర్హత కలిగిన అభ్యర్థులను ఎంపిక చేస్తాయని తెలిపారు. ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువతీయువకులు తమ వివరాలను https://naipunyam.ap.gov.in వెబ్‌సైట్‌లో తప్పనిసరిగా నమోదు చేసుకొని, రిఫరెన్స్ నెంబర్ తో పాటుగా బయోడేటా, ఆధార్ కార్డు, విద్యార్హత సర్టిఫికేట్లు ఒరిజినల్, జిరాక్స్, పాస్‌పోర్టు సైజ్ ఫోటోతో హాజరు కావాలని తెలిపారు. వివరాలకు 7995691295 లేదా టోల్ ఫ్రీ 9988853335 ను సంప్రదించాలని తెలిపారు.

వరి కోతలు ప్రారంభం

- ముమ్మరంగా పంట కోత ప్రయోగాలు
- గతం కన్నా దిగుబడి పెరుగుతుందని అంచనా

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

జిల్లాలో వరి కోతలు ప్రారంభమయ్యాయి. ఇప్పటికే 19శాతం పూర్తయినట్టు అధికారులు అంచనా వేశారు. మరికొన్నిచోట్ల పాలుపోసే దశ, గింజ గట్టిపడే దశ, ఇంకొన్ని ప్రాంతాల్లో కోతకొచ్చే దశ వరకు ఉన్నాయి. కోతకు అందుతున్న ప్రతి చోటా వ్యవసాయ శాఖ సిబ్బంది పంట కోత ప్రయోగాలు చేస్తున్నారు. కోతలు ప్రారంభం కావడంతో రైతులు, వ్యవసాయ కార్మికులు బిజీబిజీగా ఉన్నారు. భవన నిర్మాణం తదితర పనుల కోసం విశాఖపట్నం, విజయవాడ, హైదరాబాద్, చెన్నై తదితర మహానగరాలకు వలసపోయిన వారిలో చాలా మంది చిన్నసన్నకారు రైతులు, వ్యవసాయ కార్మికులు ఉన్నారు. వీరంతా తమ స్వగ్రామాలకు చేరుకుంటున్నారు. జిల్లాలో ఈ ఏడాది 2,45,533 ఎకరాల్లో వరి సాగైంది. ఇందులో అధికారిక లెక్కల ప్రకారం ఇప్పటి వరకు 45,716 ఎకరాల్లో వరి కోతలు పూర్తయ్యాయి. ఇందులో ఎక్కువ విస్తీర్ణం, చీపురుపల్లి, మెరకముడిదాం, గరివిడి, తెర్లాం, వంగర, బొబ్బిలి, సంతకవిటి, గుర్ల, రేగిడి ఆమదాలవలస మండలాల్లో ఎక్కువ విస్తీర్ణం ఉంది.జిల్లా వ్యాప్తంగా 2024 పంట కోత ప్రయోగాలు చేయాల్సివుండగా ఇప్పటి వరకు 640 వరకు చేపట్టారు. దీని ప్రకారం ప్రతి ఎకరాకు 2,317 కేజీల ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు లెక్కకడుతున్నారు. అంటే 75కేజీల బరువుగల 31బస్తా అన్నమాట. గత ఏడాది ప్రతి ఎకరాకూ సగటున 28 బస్తాల చొప్పున దిగుబడి వచ్చింది. ఈసారి ఇప్పటి వరకు చేపట్టిన ప్రయోగాల ప్రకారం అంతకు మించిన దిగుబడి వస్తున్నట్టు గణాంకాలు స్పష్టం చేస్తున్నప్పటికీ, ఇంకా చేయాల్సిన ప్రయోగాలే ఎక్కువ ఉన్నాయి. అనేకచోట్ల తక్కువలో తక్కువగా ఈ ఏడాది కనీసం 29బస్తాలు, అంటే గతం కన్నా ఒక బస్తా దిగుబడి అయినా పెరుగుతుందని అధికారులు భావిస్తున్నారు. దిగుబడి ఆశాజనకంగా ఉండడంతో రైతుల్లోనూ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. దత్తిరాజేరు, మెరకముడిదాం, ఒకటు కొత్తవలస తదితర మండలాల్లో కొన్ని గ్రామాల్లో చివరి వరకు సాగు నీటి ఎద్దడి ఎదుర్కొన్న రైతులు మాత్రం కొంత నిరాశతోనే ఉన్నారు.

ధాన్యం కొనుగోలుకు 507 కేంద్రాలు

రైతుల తిండిగింజలు పోను విక్రయించే ప్రతి గింజా కొనుగోలు చేస్తామని అధికార యంత్రాంగం చెబుతోంది. ఈలెక్కన 3.20లక్షల మెట్రిక్ టన్నుల సేకరణకు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందుకోసం ప్రత్యేక సిబ్బందిని కూడా నియమించారు. గోనె సంచులు కూడా అందుబాటులో ఉంచినట్టు సివిల్ సప్లై అధికారులు చెబుతున్నారు. సాధారణ రకం క్వింటా రూ.2,300 ధర ప్రకటించిన సంగతి తెలిసిందే. కొనుగోలు చేసిన 24గంటల్లో బిల్లులు చెల్లిస్తామని ప్రభుత్వం ప్రకటించింది.

వసతిగృహాల మరమ్మతులకు ప్రతిపాదనలు

సంక్షేమ, వైద్య, ఆరోగ్య శాఖల ప్రణాళికలపై సమీక్షించిన కలెక్టర్

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

సాంఘిక సంక్షేమ వసతిగృహాల సొంత భవనాల నిర్మాణాలకు, మరమ్మతులకు ప్రతిపాదనలు పంపాలని కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్... సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ తన ఛాంబర్‌లో ఏడాది కార్యాచరణ ప్రణాళికపై సాంఘిక సంక్షేమ, బిసి సంక్షేమ, గిరిజన సంక్షేమ, వికలాంగుల, మైనారిటీల సంక్షేమ శాఖ, వైద్య ఆరోగ్య, ఐసిడిఎస్ శాఖల అధికారులతో సమీక్షించారు. జిల్లాలో సోషల్ వెల్ఫేర్ హాస్టళ్లు 30 ఉండగా, 7 సొంత భవనాల కోసం ప్రతిపాదనలు ఇదివరకే పంపినట్లు ఆ శాఖ డిడి తెలిపారు. రూ.3 లక్షలలోపు మరమ్మతులు ఉన్నవాటిని గుర్తించి వెంటనే ప్రతిపాదనలను పంపాలని డిడికి కలెక్టర్ సూచించారు. 19 బిసి వసతిగృహాల భవనాల కోసం కూడా వెంటనే డిఇ లేఖ రాయాలని సూచించారు. మండల ప్రత్యేకాధికారులు ప్రతి నెలా వసతిగృహాలను తనిఖీ చేస్తున్న నివేదికలను కూడా హెచ్ఓడిలకు పంపాలన్నారు. ఎస్‌సి ఫైనాన్స్ కార్పొరేషన్ నుండి రూ.7 కోట్లు, సహాయ కార్పొరేషన్ నుంచి రూ.5.5 కోట్లు రుణాలిచ్చినట్లు తెలిపారు. రుణాలు పొందిన వారు తిరిగి చెల్లించేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు.

రక్తహీనత, బాల్య వివాహాలపై దృష్టి పెట్టాలి

వైద్య ఆరోగ్య, స్త్రీ శిశు సంక్షేమ శాఖల సమీక్షలో భాగంగా గర్భిణులు, తల్లుల్లో, అంగన్వాడీ బాలల్లో రక్త హీనత శాతం తగ్గేలా చూడాలని కలెక్టర్ తెలిపారు. అంగన్వాడీ కేంద్రాల్లో మరుగుదొడ్ల నిర్మాణాలను వెంటనే మొదలెట్టాలని సూచించారు.

ఈ సమావేశంలో సిపిఒ బాలాజీ, ఐసిడిఎస్ పిడి శాంతకుమారి, జిల్లా బిసి సంక్షేమ, సాంఘిక సంక్షేమ, వికలాంగుల సంక్షేమ, మైనారిటీ సంక్షేమ, బిసి, ఎస్‌సి కార్పొరేషన్ అధికారులు పాల్గొన్నారు.

రిలే దీక్షలు చేస్తున్న 108 ఉద్యోగులు

108 వ్యవస్థను ప్రభుత్వమే నిర్వహించాలి

కలెక్టరేట్ వద్ద రిలే నిరాహార దీక్ష ● 25లోగా సమస్యలు పరిష్కారం కాకపోతే సమ్మె

ప్రజాశక్తి-విజయనగరం కోట

108 వ్యవస్థను ప్రభుత్వమే నేరుగా నిర్వహించాలని డిమాండ్ చేస్తూ 108 సర్వీసెస్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ వద్ద రిలే నిరాహారదీక్షలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆసంఘం జిల్లా అధ్యక్షులు వేమల అప్పలనాయుడు, వర్కింగ్ ప్రెసిడెంట్ కొల్లి గోపాలరావు మాట్లాడుతూ ప్రభుత్వం గతంలో తీసుకువచ్చిన 49 జీవోను పునరుద్ధరించాలన్నారు. ప్రభుత్వ వైద్య ఆరోగ్య శాఖలో భర్తీ చేస్తున్న పోస్టుల్లో 108 సిబ్బందికి వెయిటేజ్ కల్పించాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు మాదిరిగానే ఎనిమిది గంటల పని విధానాన్ని అమలు చేయాలన్నారు. ఉద్యోగులకు రావలసిన బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. ఐదేళ్ల పూర్తయిన ఉద్యోగులకు స్లాబ్ విధానాన్ని అమలు చేయాలి, హెల్త్ కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్లు నెరవేర్చకపోతే ఈనెల 25 తరువాత సమ్మెకు వెళ్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి, బోని వెంకటరమణ, 108 ఉద్యోగులు పాల్గొన్నారు.

విఆర్ఎలపై నిర్బంధం

జిల్లా వ్యాప్తంగా పలువురి అరెస్టు, విడుదల ● అక్రమ అరెస్టులు అన్యాయం : సిఐటియు

లక్కవరపుకోట పోలీసుస్టేషన్‌లో ఉన్న విఆర్ఎలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

తమ సమస్యలు పరిష్కారానికి సోమవారం రాజధానిలోని సిసిఎల్ఎ కార్యాలయానికి సామూహిక రాయభారం కార్యక్రమానికి విఆర్ఎల సంఘం రాష్ట్ర కమిటీ తలపెట్టింది. ఈ నేపథ్యంలో పోలీసులు విఆర్ఎలు విజయవాడ వెళ్లకుండా ముందస్తు హౌస్ అరెస్టులకు పాల్పడ్డారు. పలువురిని అరెస్టు చేసి స్టేషన్లలో నిర్బంధించారు. విజయనగరంలో విఆర్ఎల సంఘం జిల్లా కె.గురుమూర్తి, నాయకులు ఆదినారాయణ, వేపాడలో జిల్లా ప్రధాన కార్యదర్శి జి.వెంకన్న, ఎస్ కోటలో అప్పారావు, ఎల్.కోట లో రాంబాబు తదితరులను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్లకు తరలించారు. పోలీసు చర్యలను సిఐటియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పి.శంకర్రావు, కె.సురేష్ ఖండించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో విఆర్ఎలకు జగన్ మోహన్ రెడ్డి తీవ్రమైన అన్యాయం చేశారని, తెలిపారు. కూటమి ప్రభుత్వం అయినా విఆర్ఎలకు న్యాయం చేస్తుందని ఎన్నో ఆశలతో ఉన్నారన్నారు. తెలంగాణ రాష్ట్రంలో అమలవుతున్న విధంగా విఆర్ఎలకు పే స్కేల్ అమలు చేయాలని, నిబంధనలకు విరుద్ధంగా నైట్ వాచ్‌మెన్ డ్యూటీలు, ఇసుక వద్ద డ్యూటీ లను రద్దు చేయాలని, విఆర్ఓ, అటెండర్, రికార్డ్ అసిస్టెంట్, డ్రైవర్స్ వంటి ఖాళీ పోస్టులను అర్హులైన విఆర్ఎలతో భర్తీ చేయాలని, నామినీలను రెగ్యులర్ విఆర్ఎలు గుర్తించాలని తదితర డిమాండ్లతో ఈ కార్యక్రమాన్ని విఆర్ఎలు తలపెట్టారని చెప్పారు. ప్రభుత్వం చిత్తశుద్ధి ఉంటే విఆర్ఎల న్యాయమైన సమస్యలను వెంటనే పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు

పూసపాటిరేగ : తమ హక్కుల కోసం పోరాడుతున్న విఆర్ఎలను గృహ నిర్బంధం, అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నామని, ఇది సరికాదని ఆ సంఘ నాయకులు బచ్చల సూర్యనారాయణ అన్నారు. విఆర్ఎలు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళగిరి సీసీఎల్ఎ ఆఫీస్‌కు సామూహిక రాయబారం కోసం జిల్లాలో ఉన్న విఆర్ఎలందరూ పెద్ద ఎత్తున ఆదివారం బయలుదేరిన సమయంలో పోలీసులు గృహ నిర్బంధం చేయడం అన్యాయమన్నారు. రెవెన్యూ వ్యవస్థలో గ్రామస్థాయిలో కింది స్థాయి ఉద్యోగులుగా పనిచేస్తూ, ప్రభుత్వానికి సేవలందిస్తున్న విఆర్ఎల సమస్యలు పరిష్కారం చేయ్యకుండా ప్రభుత్వం ఈ విధమైన చర్యలకు పూనుకోవడం సరైంది కాదన్నారు.

ఎస్.కోటను విశాఖ జిల్లాలో చేర్చాలి

ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి

శృంగవరపుకోట : శృంగవరపుకోట నియోజకవర్గాన్ని విశాఖపట్నం జిల్లాలో కలపాలని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి కోరారు. ఈ విషయాన్ని సోమవారం జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ఆమె ప్రస్తావించారు. ఈ సందర్భంగా ఒక్కొక్క పార్లమెంటు పరిధిని ఒక్కొక్క జిల్లాగా గత ప్రభుత్వం నిర్ణయించి, పునర్విభజన చేసిందని తెలిపారు. అందులో భాగంగా విశాఖ జిల్లా పార్లమెంటు పరిధిలో ఉన్న శృంగవరపుకోట నియోజకవర్గాన్ని ఆ జిల్లాలో చేర్చకుండా, విజయనగరం జిల్లాలోనే కొనసాగిస్తున్నారని చెప్పారు. కూటమి ప్రభుత్వం కూడా ఎన్నికల హామీలో భాగంగా నియోజకవర్గాన్ని విశాఖ జిల్లాలో కలుపుతామని హామీ ఇచ్చిందని, ఆ మేరకు శృంగవరపుకోట నియోజకవర్గాన్ని విశాఖ జిల్లాలో కలపాలని కోరారు.

లేఅవుట్‌లో ఆక్రమణలు తొలగింపు

విజయనగరం టౌన్ : నగరంలో ప్రభుత్వ స్థలాలు ఆక్రమణలకు గురికాకుండా రక్షణ చర్యలను చేపడుతున్నామని కమిషనర్ పల్లి నల్లనయ్య తెలిపారు. సోమవారం టౌన్ సెంటర్ లేఅవుట్‌లో పార్కు స్థలంలో ఆక్రమణలను తొలగించి వేశారు. అసిస్టెంట్ సిటీ ప్లానర్ హరిబాబు, ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి, టిపిఎస్ అనితతో కలిసి జెసిబిల సహాయంతో ఆక్రమణలను తొలగించారు. రామారాయుడు రోడ్డులో ఫుట్‌పాత్‌పై ఉన్న భోజనశాలను ప్రణాళిక సిబ్బంది అక్కడి నుండి తరలించారు.

అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ అంబేద్కర్

గ్రీవెన్స్‌కు 205 వినతులు

ఎంఎస్ఎంఇ, స్కిల్ సర్వేలు పక్కాగా చేపట్టాలి : జెసి

ప్రజాశక్తి-విజయనగరంకోట

ప్రజా ఫిర్యాదుల విభాగానికి వచ్చిన వినతులకు నాణ్యమైన, కచ్చితమైన సమాధానాలు ఇవ్వాలని, రీ ఓపెన్ చేసే పరిస్థితి లేకుండా చూడాలని జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్ తెలిపారు. ఏ వినతులు ఆ రోజే అధికారులు ఓపెన్ చేయాలని, ఎక్కువగా రెవిన్యూ కు చెందిన వినతులే వస్తున్నాయని, తహశీల్దార్లు ఈ విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలని తెలిపారు. సోమవారం ప్రజా వినతులు పరిష్కార వేదికలో భాగంగా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్, జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్, డిఆర్ఓ శ్రీనివాసమూర్తి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. మొత్తం 205 అర్జీలు అందగా, భూ సమస్యలకు సంభందించి రెవిన్యూ శాఖకు అత్యధికంగా 144 ,వినతులు అందాయి. పింఛన్లు మంజూరు చేయాలని తదితర అంశాలపై డిఆర్‌డిఎకు 10 వినతులు అందాయి. మున్సిపాలిటీకి 8 , పంచాయతీ శాఖకు 6 , విద్యా శాఖకు 10 అందగా, వైద్య శాఖకు 6 అందాయి. మిగిలినవి ఇతర శాఖలకు చెందినవి ఉన్నారు. అనంతరం సంయుక్త కలెక్టర్ సేతు మాధవన్ అధికారులతో మాట్లాడారు. ఎంఎస్ఎంఇ సర్వే మర్చి నెలాఖరులోగా పూర్తి చేయాలని తెలిపారు. అందుకు అవసరమైన మార్గదర్శకాలు త్వరలో విడుదల చేస్తామని, శిక్షణ కూడా ఇస్తామని తెలిపారు. స్కిల్ సెన్సస్ కూడా ఈ నెల నుండే జరగాలని, అందుకు అవసరమైన మాస్టర్ ట్రైనీ లకు శిక్షణలు పూర్తి చేశామని తెలిపారు. జిల్లాలో 48 రీచ్‌లు అందుబాటు లో ఉన్నాయని, ప్రతి రీచ్ కు ఒక గ్రామ కార్యదర్శి ఇన్‌ఛార్జిగా ఉన్నారని తెలిపారు. కార్యదర్శి వద్ద నుండి పొందిన రసీదును తీసుకొని ఇసుకను పొందవచ్చునని తెలిపారు. లోకాయుక్త కేసు లను పెండింగ్ లేకుండా సత్వరమే పరిష్కరించుకోవాలని ఆయా అధికారులకు సూచించారు.

వార్డెన్‌ను సస్పెండ్ చేయాలి : ఎస్ఎఫ్ఐ

విజయనగరం టౌన్ : ఇటీవల నగరంలోని బిసి వసతి గృహంలో విద్యార్థి మృతికి కారణమైన హాస్టల్ వార్డెన్ జానకిరామ్‌ను సస్పెండ్ చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు జె.రవికుమార్ జిల్లా జాయింట్ కలెక్టర్‌ను కోరారు. సోమవారం జెసికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విచారణ జరిపి వెంటనే చర్యలు తీసుకుంటామని డిబిసిడబ్ల్యుఒ చెప్పినా నేటికీ చర్యలు లేవన్నారు. అదే సమయంలో వార్డెన్ ప్రవర్తన కారణంగా ఈ నెలలో 16 మంది విద్యార్థులు హాస్టల్ నుంచి ఇంటికి వెళ్లిపోయారని తెలిపారు. వినతి పత్రం అందించిన వారిలో ఎస్ ఎఫ్ ఐ నాయకులు పాల్గొన్నారు.

ధాన్యం రవాణా, కళాసీ ఛార్జీలు చెల్లించాలి

ప్రజాశక్తి-బొబ్బిలి

2021-22 ఖరీఫ్ సీజన్లో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించిన రైతులకు రవాణా, కళాసీ ఛార్జీలు చెల్లించాలని ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్.గోపాలం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రవాణా, కళాసీ ఛార్జీలు చెల్లించాలని కోరుతూ సోమవారం పిఎసిఎస్ కార్యదర్శి వి.తమ్మినాయుడును కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు సంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేస్తే ప్రభుత్వం కళాసీ ఛార్జీల కోసం రూ.10కోట్లు, రవాణా ఛార్జీలకు రూ.12 కోట్లు జిల్లాకు విడుదల చేసిందన్నారు. ప్రభుత్వం నిధులు విడుదల చేసినా జిల్లా అధికారులు పిఎసిఎస్ కేంద్రాలకు పూర్తి స్థాయిలో నిధులు విడుదల చేయకపోవడం అన్యాయమన్నారు. తక్షణమే రైతుల బ్యాంకు ఖాతాల్లోకి జమ చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై సెక్రటరీ తమ్మినాయుడు స్పందిస్తూ వారం రోజులలో రైతుల జాబితా సిద్ధం చేసి పంపిణీ చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు, రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు యు.ప్రసాద్, రెడ్డి త్రినాథ పాల్గొన్నారు.

జాతీయ బాక్సింగ్ పోటీలకు జిల్లా బాక్సర్లు ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

ఆంధ్ర విశ్వవిద్యాలయ స్థాయిలో నిర్వహించిన బాక్సింగ్ పోటీల్లో పాల్గొని విజేతలుగా నిలిచి జాతీయ పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధించిన జిల్లా బాక్సింగ్ క్రీడాకారులను జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్ అభినందించారు. ఎయు స్థాయిలో నవంబరు 15, 16 తేదీల్లో జరిగిన అంతర్ విశ్వవిద్యాలయ బాక్సింగ్ పోటీల్లో విజేతలుగా నిలిచిన జిల్లా బాక్సింగ్ క్రీడాకారులు సోమవారం కలెక్టర్ కార్యాలయ ఆడిటోరియంలో జాయింట్ కలెక్టర్‌ను కలిశారు. 46-48 కిలోల విభాగంలో స్వర్ణ పతకం సాధించిన ఎస్.తేజస్వి, 48-51 కిలోల విభాగంలో స్వర్ణ పతక విజేత ఎ.సాయి, 52 కిలోల విభాగంలో రజత పతక విజేత ఎస్.కె.సుల్తానా, 93 కిలోల విభాగంలో స్వర్ణ పతక విజేత జి.లిఖిత్ రెడ్డి జెసిని కలిశారు. ఈ సందర్భంగా వారిని జెసి అభినందిస్తూ జాతీయ స్థాయిలో పంజాబ్‌లోని భటిండాలో డిసెంబరు 26 నుంచి జరిగే అఖిల భారత విశ్వవిద్యాలయ బాక్సింగ్ పోటీల్లో విజేతలుగా నిలవాలని ఆకాంక్షించారు. డిఎస్‌డిఒ వెంకటేశ్వరరావు, బాక్సింగ్ కోచ్ ఈశ్వరరావు పాల్గొన్నారు.

కెజిబివి నాన్ టీచింగ్ పోస్టుల భర్తీకి

22న సర్టిఫికెట్లు పరిశీలన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయాలలో టీచింగ్, నాన్-టీచింగ్ (అకౌంటెంట్, వార్డెన్ పోస్టులకు మాత్రమే) పోస్టుల భర్తీకి 1:3నిష్పత్తిలో అభ్యర్థులను ఎంపిక చేసినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి మాణిక్యం నాయుడు తెలిపారు. ఈ మెరిట్ లిస్టును Vizianagaram.ap.gov.in వెబ్‌సైట్‌లో ఈనెల 19న ఉంచుతామని పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థులు సమగ్ర శిక్షా కార్యాలయంలో ఈనెల 22న ఉదయం 10గంటలకు తమ ఒరిజినల్, జెరాక్స్ సర్టిఫికేట్లతో హాజరు కావాలని తెలిపారు.

తాటిపూడిలో బోటింగ్‌కు అనుమతి

ప్రజాశక్తి-విజయనగరంకోట

దీర్ఘకాలంగా పర్యాటకుల ఎదురుచూపులకు పరిష్కారం లభించింది. తాటిపూడి రిజర్వాయర్‌లో బోటింగ్ నిర్వహణ త్వరలో ప్రారంభం కానుంది. మంత్రి కొండపల్లి శ్రీనివాస్ కృషి మేరకు తాటిపూడి రిజర్వాయర్లో బోటింగ్ కోసం జలవనరుల శాఖ అనుమతులు జారీ చేసింది.

గంట్యాడ మండలంలో ఉన్న తాటిపూడి రిజర్వాయర్‌లో బోటింగ్ కోసం పర్యాటకులు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే, మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఆ ప్రాంత ప్రజలు బోటింగ్ కార్యక్రమాలు పునరుద్ధరించాలని కోరారు. ఫలితంగా జిల్లా అధికార యంత్రాంగం, పర్యాటక, జలవనరుల శాఖ అధికారులతో పలుమార్లు మంత్రి సంప్రదించి బోటింగ్ కార్యక్రమాలకు అనుమతులు సాధించారు. ఇప్పటికే జనవనరుల శాఖ, పర్యాటక శాఖ ఆధ్వర్యంలో బోటింగ్ కార్యక్రమాల నిర్వహణ కోసం అనుమతులు ఇచ్చింది. త్వరలో బోటింగ్ కార్యకలాపాల కోసం అవసరమైన మౌలిక వసతుల కల్పన పనులు మరో వారం రోజుల్లో ప్రారంభం కానున్నాయి. ఇందుకోసం అవసరమైన జెట్టి నిర్మాణ పనులను ప్రారంభించి నెల రోజుల్లోపు పూర్తి చేయనున్నారు. జెట్టి పూర్తయిన వెంటనే తాటిపూడి రిజర్వాయర్‌లో బోటింగ్ కార్యక్రమాలు ప్రారంభమవుతాయి. దీంతో ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న పర్యాటకుల కోరిక త్వరలో తీరునుంది. ఫలితంగా తాటిపూడి రిజర్వాయర్ నిత్యం పర్యాటకులతో కళకళలాడనుంది.

నూతన చట్టాలను అవగాహన చేసుకోవాలి

విజయనగరం కోట : శిక్షణ పొందుతున్న సిబ్బంది ఎప్పటికప్పుడు నూతన చట్టాలను అవగాహన చేసుకోవాలని ఐఆర్ఎస్ అడిషనల్ డైరెక్టర్, నాసిన్ జెఎం కిషోర్ అన్నారు. పోలీసు శిక్షణ కళాశాలలో సోమవారం 49మంది కస్టమ్స్ ఇన్‌స్పెక్టర్ పోలీసు శిక్షణకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన క్రిమినల్ లా-2023 గురించి పూర్తిగా తెలుసుకోవాలని సూచించారు. ప్రిన్సిపాల్ డి.రామచంద్ర రాజు మాట్లాడుతూ శిక్షణలో అవుడోర్ శారీరక శిక్షణతో పాటు, ఆయుధాల వినియోగంపై శిక్షణ, డ్రిల్, ఫైరింగ్‌పై తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పి.వి. అప్పారావు, డిఎపి టి.రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

సహకార రంగాన్ని బలోపేతం చేయాలి

డివిజన్ సహకార శాఖ అధికారి రామమూర్తి ● విద్యుత్ ఉద్యోగుల సొసైటీ ఆధ్వర్యంలో ఘనంగా సహకార వారోత్సవాలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సహకార రంగాలను,సొసైటీలను బలోపేతం చేయడం ద్వారానే వికసిత్ భారత్ నిర్మాణం జరుగుతుందనిడివిజనల్ సహకార అధికారి డి.రామమూర్తి అన్నారు. నగరంలో విద్యుత్ ఉద్యోగుల శ్రీ వెంకటేశ్వర ఎపిఇపిడిసిఎల్ ఉద్యోగుల కోపరేటివ్ క్రెడిట్ సొసైటీ ఆధ్వర్యంలో సొసైటీ భవనంలో సోమవారం సహకార వారోత్సవాలను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డివిజనల్ సహకార అధికారి డి.రామమూర్తి మాట్లాడుతూ విద్యుత్ శాఖ ఉద్యోగులు సొసైటీ పని తీరును ,ఉద్యోగులకు సొసైటీ అంటిస్తున్న సేవలను కొనియాడారు. సహకారం ఉంటేనే ఆర్థిక సమస్యలు పరిష్కారం కావడంతోపాటు, మనలో సహకార భావం పెరుగుతుందన్నారు. సహకార సొసైటీ లు బలోపేతం కావడం ద్వారా రుణాలు కోసం బ్యాంకుల చుట్టూ వెళ్లాల్సిన అవసరం ఉండదన్నారు. విద్యుత్ ఉద్యోగులు సొసైటీ ఉద్యోగికి రూ.15 లక్షలు వరకు రుణం అందించే అవకాశం ఉండడం అభినందనీయమన్నారు. పన్నులు, హౌసింగ్ రుణాలు విషయంలో అధికారులు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తున్నామని తెలిపారు. సహకార ఎడ్యుకేషనల్ అధికారి రమేష్ మాట్లాడుతూ సహకారం ఉంటేనే మెరుగైన సమాజం, మెరుగైన జీవన విధానం ఏర్పడతాయన్నారు. సొసైటీ అధ్యక్షులు రామినాయుడు మాట్లాడుతూ నేడు సొసైటీ ఆర్థిక సహకారాన్ని ఉద్యోగులకు అందించడంతో పాటు సామాజిక కార్యక్రమాలు నిర్వహించి ఉద్యోగులకు తోడుగా ఉంటుందన్నారు. నేడు రూ. 9 కోట్ల టర్నవర్ ఉందన్నారు. పూర్వ అధ్యక్షులు డిఆర్ఎస్ ప్రసాద్, రాజేంద్ర ప్రసాద్, 1104 యూనియన్ రీజనల్ కార్యదర్శి ఎస్.లక్ష్మణరావు మాట్లాడుతూ సొసైటీ ఏర్పాటు అయినప్పటి నుంచి ఉద్యోగులకు అందిస్తున్న సేవలను వివరిస్తూ సొసైటీ ద్వారా మరిన్ని సేవలు అందించేందుకు కృషి చేయాలని కోరారు. కార్యదర్శి కూర్మరావు అధ్యక్షతన జరిగిన సభలో సొసైటీ ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రతిజ్ఞ చేస్తున్న విద్యుత్తు సహకార సొసైటీ ఉద్యోగులు

ఎస్‌పి గ్రీవెన్స్‌కు 31 ఫిర్యాదులు

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఎస్‌పి కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌కు 31 ఫిర్యాదులు అందాయి. వీటిని ఎస్‌పి వకుల్ జిందాల్ స్వీకరించి, సమస్యలను సంబంధిత అధికారులకు వివరించారు. పరిష్కారానికి చట్ట పరిధిలో చర్యలు చేపట్టి, న్యాయం చేయాలని అధికారులను ఎస్‌పి ఆదేశించారు. కార్యక్రమంలో ఎఎస్‌పి పి.సౌమ్యలత, ఎస్‌బి సిఐ ఎ.లీలారావు, డిసిఆర్‌బి ఎస్ఐ రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్‌పి వకుల్ జిందాల్

పోక్సో కేసులో నిందితుడికి మూడేళ్ల జైలు

ప్రజాశక్తి-విజయనగరం కోట

బూర్జివలస పోలీసు స్టేషనులో 2021లో నమోదైన పోక్సో కేసులో నిందితుడు దత్తిరాజేరు మండలం పాచలవలస గ్రామానికి చెందిన సైలాడ లక్ష్మణరావు (33)కు విజయనగరం పోక్సో ప్రత్యేక న్యాయమూర్తి కె.నాగమణి మూడేళ్ల ఖైదు, రూ.2వేలు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. ఇంటర్ చదువుతున్న బాలిక వెంటపడి వేధింపులకు పాల్పడుతూ, కిడ్నాప్ చేసి అత్యాచారం చేసాడని బూర్జవలస పోలీసు స్టేషనులో ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి బూర్జువలస ఎస్ఐ కె.రాజేష్ కేసు నమోదు చేసారు. ఈ కేసును అప్పటి బొబ్బిలి సబ్ డివిజన్ డిఎస్పీ బి.మోహనరావు దర్యాప్తు పూర్తి చేసి, నిందితుడిని అరెస్టు చేసి, న్యాయ స్థానంలో అభియోగ పత్రం దాఖలు చేసారు. నిందితుడిపై నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

అంతర్ విశ్వవిద్యాలయ క్రాస్‌కంట్రీ పోటీలకు సీతం విద్యార్థి

ప్రజాశక్తి-విజయనగరం

యశ్వంత్‌ని అభినందిస్తున్న సీతం డైరెక్టర్ శశిభూషణరావు

సీతం ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థి ఎం. సాయి యశ్వంత్ అఖిల భారత అంతర విశ్వవిద్యాలయ స్థాయిలో పోటీలకు అథ్లెటిక్స్ విభా గంలో క్రాస్ కంట్రీ ఈవెంట్‌లో పదివేల మీటర్లకు అర్హత సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.వి.రామమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. యశ్వంత్‌ను సీతం కళాశాల డైరెక్టర్ మజ్జి శశిభూషణరావు అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి, కళాశాలకు, తల్లిదండ్రులకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆకాంక్షించారు.

జీడి బీమా గడువు పెంపు

ప్రజాశక్తి-విజయనగరంకోట

జీడిమామిడి పంటకు వాతావరణ ఆధారిత భీమా చెల్లింపు గడువు ఈనెల 15న ముగియడంతో ఆసక్తి కలిగిన రైతులు వివిధ సమస్యలతో బీమా ప్రీమియం చెలించలేకపోయారు. బీమా విషయం లో రైతుల నుండి అనూహ్య స్పందన లభించి ఇప్పటి వరకు రూ.4.97 లక్షల ప్రీమియం చెల్లించారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని కేంద్ర ప్రభుత్వం ఈనెల 22 వరకు జీడి పంటకు వాతావరణ ఆధారిత బీమా ప్రీమియం చెల్లింపు గడువు తేదీని పొడిగించారు. కావున రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవాలని ఉద్యానశాఖ అధికారి జమదగ్ని కోరారు.

వినతులకు తక్షణ పరిష్కారం

కమిషనర్ నల్లనయ్య

విజయనగరం టౌన్ : ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చిన వినతులను తక్షణమే పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య తెలిపారు. సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు మూడు వినతులు వచ్చాయి. వాటి పరిష్కారానికి ఆయా విభాగాల అధికారులకు అందజేశారు. మంగళవారం ఉదయం నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి, ఇఇ టి.రాయల్ బాబు, అసిస్టెంట్ సిటీ ప్లానర్ రమణమూర్తి పాల్గొన్నారు.

నైపుణ్య గణన నూరుశాతం పూర్తిచేయాలి

ఇంటింటి నైపుణ్య గణన సర్వే నూరు శాతం పూర్తిచేయాలని సచివాలయ కార్యదర్శులకు, సిబ్బందికి కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశించారు. ఈ మేరకు ఇంటింటి నైపుణ్య గణన విధి విధానాలను ఆయన వివరించారు. ఇందుకోసం ప్రతి సచివాలయ పరిధిలో కార్యదర్శులకు శిక్షణ తరగతులను నిర్వహించారు.

పారదర్శకంగా నైపుణ్య గణన

ప్రజాశక్తి-రామభద్రపురం

నైపుణ్య గణనపై సచివాలయ సిబ్బంది పారదర్శకంగా సర్వే నిర్వహించాలని ఎంపిడిఒ రత్నం సూచించారు. ఎంపిడిఒ కార్యాలయంలో సోమవారం నైపుణ్య గణనపై సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన డేటాను సక్రమంగా అప్‌లోడ్ చేయాలన్నారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఎఒ సన్యాసిరావు, ఇఒపిఆర్‌డి వెంకటరమణ, మండల టెక్నికల్ రిసోర్స్ పర్సన్ చిట్టూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కాపరికి ఆర్థిక సహాయం

ప్రజాశక్తి- తెర్లాం

మండలంలోని కూనాయవలసలో కుక్కల దాడిలో ఎనిమిది గొర్రెలు మరణించిన విషయం తెలిసిందే. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బేబినాయన.. గొర్రెల కాపరి బమ్మిడి అప్పన్నకు రూ.15 వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఆ మొత్తాన్ని టిడిపి మండల అధ్యక్షులు ఎన్.వెంకట్‌నాయుడు, నాయకులు ఎన్.వెంకటేశ్వరరావు.. సోమవారం ఆ కాపరికి అందజేశారు.

ప్రతిభ కళాశాలలో సదస్సు

గజపతినగరం : గమ్యం స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు వేమలి చైతన్య బాబు ఆధ్వర్యంలో సోమవారం ప్రతిభ జూనియర్ కళాశాలలో విద్యార్థులు-గ్రంథాలయాలు అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ సేవా సంఘం వ్యవస్థాపకులు అబ్దుల్ రవూఫ్ మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞానాన్ని అందించే ఆలయాలని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసరావు, అధ్యాపకులు గౌరీ ప్రసాద్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

మొబైల్ వినియోగంలో అప్రమత్తం

ప్రజాశక్తి-రామభద్రపురం

మొబైల్ ఫోన్ వినియోగించే ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ ప్రసాదరావు సూచించారు. స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్‌లో సోమవారం వివిధ ప్రాంతాల ప్రయాణికులకు ఆయన అవగాహన కల్పించారు. ఇటీవల సెల్‌ఫోన్ దొంగలు ఎక్కువ అయ్యారని, ఆదరా బాదరాగా ప్రయాణాలు చేసే వారిని లక్ష్యంగా చేసుకుని దొంగిలిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో హెచ్‌సి నాగేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల కోసం ధర్నా

ప్రజాశక్తి-కొత్తవలస

కూటమి ప్రభుత్వం హామీల్లో భాగంగా పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సిపిఐ ఆధ్వర్యాన తహశీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా చేశారు. అనంతరం తహశీల్దార్‌కు వినతి అందించారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు డి.అప్పలరాజు పాల్గొన్నారు.

రామభద్రపురం : పక్కా ఇళ్లు మంజూరు చేయాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి అలమండ ఆనందరావు ఆధ్వర్యాన సోమవారం కొట్టక్కి సచివాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు లెంక లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

కెజిబివిని సందర్శించిన ఎంఇఒలు

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని బక్కునాయుడుపేట వద్దనున్న కెజిబివిని సోమవారం ఎంఇఒలు జగదీశ్వరరావు, బాలభాస్కరరావు సందర్శించారు. విద్యార్థుల విద్యా సామర్థ్యాలను పరీక్షించారు. ఈ పరీక్ష ఫలితాలను రాష్ట్ర అధికారులకు పంపిస్తామని వారు చెప్పారు. అనంతరం విద్యార్థులకు ఇస్తున్న మెనూ పరిశీలించారు. పరిశీలనలో సిఆర్‌పిలు కె.రాంప్రసాద్, వై.వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

జీడిపంట బీమా గడువు పొడిగింపు

ప్రజశక్తి-శృంగవరపుకోట

జీడిపంటకు బీమా రిజిస్ట్రేషన్ గడువు తేదిని ఈ నెల 22 వరకు ప్రభుత్వం పొడిగించిందని మండల వ్యవసాయ అధికారి కె.రవీంద్ర తెలిపారు. ఎకరా జీడి పంటకు రూ.1500 బీమా ప్రీమియం చెల్లించాలని చెప్పారు. ఈ అవకాశాన్ని జీడి రైతులంతా వినియోగించుకోవాలని కోరారు.

ఆంగ్ల అధ్యాపక పోస్టు ఖాళీ

శృంగవరపుకోట : మండలంలోని తాటిపూడి వద్దనున్న గురుకుల బాలికల కళాశాలలో ఆంగ్లం బోధించుటకు పోస్ట్ ఖాళీగా ఉందని కళాశాల ప్రిన్సిపల్ లక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. పీజీ చదివిన మహిళలు మాత్రమే అర్హులని చెప్పారు. వీరికి రూ.18 వేలు జీతంగా ఇస్తారని, అర్హత కలిగిన మహిళలు కళాశాలలో ఈ నెల 20 నుంచి 22లోగా బయోడేటాతో సంప్రదించాలని సూచించారు.

బెల్ట్‌షాపులపై కఠిన చర్యలు

బొబ్బిలి : గ్రామాల్లో బెల్ట్‌షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ సతీష్‌కుమార్ హెచ్చరించారు. సోమవారం మండలంలోని కారాడ గ్రామస్తులకు చట్టాలపై ఆయన అవగాహన కల్పించారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

శృంగవరపుకోట : పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు శాఖ గ్రంథాలయ అధికారి దామోదర్ శ్రీధర్ ఆధ్వర్యాన వ్యాసరచన, చిత్రలేఖనం, క్విజ్, డిబేట్ పోటీలు నిర్వహించారు. ఉపాధ్యాయులు శ్రీదేవి, వి.మల్లేశ్వరరావు, శ్రీదాసరి, పిఇటి విజయ శాంతి పోటీలను పర్యవేక్షించారు.

నేడు ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం

వేపాడ : స్థానిక ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో మంగళవారం నిర్వహించే ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ సిహెచ్.సూర్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా చేపట్టే ప్రచార ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు.

ఎంపిడిఒకు వినతి అందజేస్తున్న ఎఎన్‌ఎంలు

అదనపు బాధ్యతల నుంచి తప్పించాలి

ఎఎన్‌ఎంల వినతి

ప్రజాశక్తి-వేపాడ

సచివాలయాల పరిధిలో పనిచేస్తున్న తమకు అదనపు బాధ్యతలు, యాప్‌ల భారం నుంచి వెసులుబాటు కల్పించాలని ఎఎన్‌ఎంలు.. సోమవారం స్థానిక ఎంపిడిఒ సూర్యనారాయణకు వినతి అందించారు. సమస్యను ఉన్నతాధికారులకు నివేదిస్తానని ఎంపిడిఒ వారికి హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎఎన్‌ఎంలు జె.వరలక్ష్మి (ఎంపిహెచ్‌ఎం), పి.వరలక్ష్మి, వి.పుష్పరాణి, కె.అప్పలకొండ, ఎన్.ముత్యాలమ్మ, కె.పద్మ, డి.పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.

దంపతుల నిజాయితీ

ప్రజాశక్తి-బొబ్బిలి

దొరికిన తులమున్నర బంగారు చేతిగొలుసు (బ్రాస్‌లెట్)ను పోగొట్టుకున్న వారికి అప్పగించి నిజాయితీని చాటుకున్నారు ఆ దంపతులు. పట్టణానికి చెందిన కింతలి నరసింహమూర్తి తులమున్నర బంగారం బ్రాస్‌లెట్‌ను ఆదివారం పోగొట్టుకున్నాడు. పట్టణంలోని దిబ్బవీధి శివాలయానికి అదేరోజు మారోజు శ్రీదేవి, మారోజు దివ్య వెళ్లగా, వారికి బ్రాస్‌లెట్ దొరికింది. ఆ వస్తువు నరసింహమూర్తిది అని తెలుసుకున్న శ్రీదేవి, ఆమె భర్త శంఖు ఆధారాలు చూసి, ఆయనదేనని నిర్ధారించుకున్నారు. సోమబవారం పట్టణ సిఐ కె.సతీష్‌కుమార్ సమక్షంలో బంగారు బ్రాస్‌లెట్‌ను అప్పగించారు. నిజాయితీ చాటుకున్న దంపతులు శంఖు, శ్రీదేవిని సిఐ సతీష్, పోలీసులు, పట్టణ ప్రజలు అభినందించారు.

లక్ష్య సాధనపై గురిపెట్టాలి

- డిఎస్‌సితో పాటో జాతీయ స్థాయి పోటీ పరీక్షలకు సన్నద్ధం కండి
- బిసి అభ్యర్థుల ఉచిత డిఎస్‌సి శిక్షణ ప్రారంభించిన కలెక్టర్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఉన్నత విద్య పూర్తిచేసిన యువత జీవితంలో సివిల్ సర్వీసెస్ వంటి ఉన్నత లక్ష్యాల సాధనపై గురిపెట్టి వాటిని సాధించేందుకు ప్రయత్నించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సూచించారు. సివిల్స్ పరీక్ష కష్టతరమని భావించవద్దని, ఇది అత్యంత సులువైనదని, ఇతర పోటీ పరీక్షల కంటే ఈ పరీక్షకు పోటీ తక్కువని చెప్పారు. పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే యువత ప్రభుత్వాలు కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని తమ లక్ష్యాల సాధనకు ప్రయత్నించాలన్నారు. బిసి సంక్షేమ శాఖఆధ్వర్యంలోని గురజాడ అప్పారావు బి.సి. స్టడీ సర్కిల్ ద్వారా డిఎస్‌సి పరీక్ష రాసే బిసి అభ్యర్థులకు అందిస్తున్న ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని కలెక్టర్ సోమవారం కస్పావీధి నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోటీ పరీక్షలను ఎదుర్కోవడంలో తన అనుభవాలను వివరించడంతోపాటు పరీక్షలను ఎలా ఎదుర్కోవాలనే అంశంపై వారికి కొన్ని మెళకువలను తెలిపారు. గతంతో పోల్చినట్లయితే నేడు ప్రభుత్వం ఉచిత శిక్షణతోపాటు స్టయిపెండ్ ఇస్తూ స్టడీ మెటీరియల్ కూడా అందిస్తోందని వాటిని సద్వినియోగం చేసుకొని ఉద్యోగాలు సాధించాలని తెలిపారు. జిల్లా బి.సి.సంక్షేమ అధికారి పెంటోజీ మాట్లాడుతూ బిసి స్టడీ సర్కిల్ ద్వారా 182 మందికి రెండు నెలలపాటు ఉచిత శిక్షణ ఇస్తున్నామని వెల్లడించారు. ఒక్కో అభ్యర్థికి రూ.1000 విలువైన స్టడీ మెటీరియల్ అందించడంతోపాటు నెలకు రూ.1500 స్టయిపెండ్‌గా అందించనున్నట్లు చెప్పారు.

అభ్యర్థులనుద్దేశించి మాట్లాడుతున్న కలెక్టర్

ఎస్.జి.టి. పరీక్ష శిక్షణకు 152 మంది, స్కూల్ అసిస్టెంట్ శిక్షణకు 30 మంది హాజరవుతున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో సహాయ బిసి సంక్షేమాధికారి యశోధన రావు పాల్గొన్నారు.

విజేతలకు కలెక్టర్ అభినందన

బాలికల సంరక్షణపై వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో పోటీలు

ప్రజాశక్తి-విజయనగరంకోట

అంతర్జాతీయ బాలికా సంరక్షణ దినోత్సవం సందర్భంగా అక్టోబరు 11వ తేదీన జిల్లా స్థాయిలో పాఠశాలల విద్యార్థులకు నిర్వహించిన పలు పోటీల విజేతలకు జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్ అభినందించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, విద్యాశాఖతో కలసి బాలికా సంరక్షణపై విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం, చిత్రలేఖన పోటీలను నిర్వహించాయి. ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా సోమవారం నగదు బహుమతులు అందజేశారు. ఒక్కో విభాగంలో ప్రథమ బహుమతి విజేతకు రూ.5వేలు, ద్వితీయ బహుమతి విజేతకు రూ.3వేలు, తృతీయ బహుమతి విజేతకు రూ.2వేలు వంతున నగదు బహుమతులు అందజేశారు. వక్తృత్వ పోటీల్లో వి.లతాశ్రీ (బి.సి.సంక్షేమ గురుకుల పాఠశాల, కొత్తవలస), టి.లావణ్య (జెడ్.పి.హైస్కూల్, వంగర), ఎం.రమ్య(కెజిబివి, గుర్ల) వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. వ్యాసరచన పోటీల్లో పి.పరిమళ (ఎపి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, చీపురుపల్లి), పి.ప్రత్యూశ్రీ (ఎపి మోడల్ స్కూల్, షికారుగంజి), పి.భాగ్యశ్రీ (జెడ్‌పి హైస్కూల్, కొట్యాడ) వరుసగా మూడు స్థానాల్లో నిలిచారు. చిత్రలేఖనంలో ఎం.గౌతమ్(జెడ్‌పి హైస్కూల్, దేవాడ), జి.జ్యోతి (కెజిబివి, గుర్ల), జి.మేఘన(బి.సి.సంక్షేమ గురుకుల పాఠశాల, కొత్తవలస) వరుసగా మూడు స్థానాల్లో నిలిచారు. కార్యక్రమంలో డిఇఒ మాణిక్యం నాయుడు, డిఎంహెచ్ఒ డాక్టర్ రాణి తదితరులు పాల్గొన్నారు.

చెక్‌డ్యాముల నిర్మాణానికి ప్రతిపాదనలు సమర్పించాలి

జిల్లాలోని వాగులు, గెడ్డలపై చెక్‌డ్యాములు నిర్మించేందుకు వారం రోజుల్లోగా ప్రతిపాదనలు సమర్పించాలని జలవనరుల శాఖ అధికారులను కలెక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆదేశించారు. ఉపాధి హామీ మెటీరియల్ కాంపొనెంట్ నిధులతో వీటిని మంజూరు చేస్తామని కలెక్టర్ చెప్పారు. ఆ శాఖ ఇంజినీర్లతో కలెక్టర్ సమీక్షించారు. వివిధ ప్రాజెక్టుల పరిధిలో ఉన్న భూముల్లో ఆక్రమణలకు గురైన వాటి వివరాలను అందజేయాలని సూచించారు. ఈ ఏడాది వివిధ ప్రాజెక్టుల పరిధిలో కాల్వల నిర్వహణ పనులు, పూడికతీత చేపట్టేందుకు రూ.6 కోట్లు మంజూరైనట్టు జలవనరుల శాఖ ఉత్తరాంధ్ర ప్రాజెక్టుల చీఫ్ ఇంజనీర్ ఎస్.సుగుణాకర్ రావు తెలిపారు. డిసెంబర్‌లోగా టెండర్లు ఖరారు చేసి, జనవరి నుంచి పనులు ప్రారంభిస్తామని వివరించారు. డిఆర్ఒ ఎస్.శ్రీనివాసమూర్తి, జలవనరుల శాఖ ఇఇలు రామచంద్రరావు, ఎంవి రమణ, డిఇలు పాల్గొన్నారు.

ఆలయం వద్ద కుళాయిని ప్రారంభిస్తున్న ఎంపిటిసి సభ్యులు పి.గౌరు

మంచిమనసు చాటుకున్న గౌరు

ప్రజాశక్తి-బాడంగి

మండలంలోని గజరాయునివలస ఎంపిటిసి సభ్యులు పాలవలస గౌరు మరోసారి మంచిమనసు చాటుకున్నారు. గ్రామంలో ఉన్న ఆలయాల్లో తాగునీటి సదుపాయం లేదు. దీంతో స్పందించిన ఆయన సొంత నిధులతో పైడిల్లమ్మ, ఎల్లమ్మతల్లి ఆలయాలు, రామాలయం వద్ద నీటి సదుపాయం కల్పించారు. దీంతో గ్రామస్తులు ఎంపిటిసిని అభినందించారు

చెరుకుపల్లిలో తాగునీటి పైపులైను లీకేజీ

ప్రజాశక్తి - భోగాపురం

మండలంలోని చెరుకుపల్లి గ్రామంలో తాగునీటి పైపు లీకేజ్ అవుతున్నప్పటికీ పంచాయతీ పట్టించుకోవడంలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఈ పైపు లీకేజీ వల్ల నీరు సక్రమంగా రావడంలేదని గ్రామానికి చెందిన తుపాకుల గురుమూర్తి, తాటిపూడి ఉదయ్ కుమార్, రిక్క ఆదినారాయణ, తోగులురెడ్డి, చిల్లా శ్రీను తదితరులు ఆరోపించారు. గత 20 రోజుల నుంచి ఈ సమస్య ఉన్నప్పటికీ పట్టించుకోలేదని అన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరమ్మత్తులు చేయాలని కోరారు.

బ్యాడ్మింటన్ పోటీల్లో వెటరన్ క్రీడాకారుల సత్తా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లులో ఆలిండియా టెన్నిస్ అసోసియేషన్ నిర్వహించిన జాతీయస్థాయి టెన్నిస్ పోటీల్లో విజయనగరం ఆఫీసర్స్ క్లబ్ క్రీడాకారులు సత్తా చాటారు. ఎంవిఎల్ఇ రాజు, సౌమిత్రి జోడి 45 కేటగిరి డబుల్స్ విభాగంలో ఛాంపియన్ షిప్ ట్రోఫీని సొంతం చేసుకున్నారు. ఈ నెల 11నుంచి 17 వరకు ఈ పోటీలను ఎఐ ఎస్‌టిఎ నిర్వహించింది. విజేతలకు మంత్రి నిమ్మల రామానాయుడు ట్రోఫీలను అందజేశారు. విజయనగరం టెన్నిస్ క్రీడకు ఖ్యాతిని అందిస్తున్న ఈ జోడిని ఆఫీసర్స్ క్లబ్ సీనియర్ టెన్నిస్ క్రీడాకారులు అభినందించారు.

ధాన్యం సేకరణపై శిక్షణ

నెల్లిమర్ల : ధాన్యం సేకరణపై వ్యవసాయ శాఖ శిక్షణా కార్యక్రమం నిర్వహించింది. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ధాన్యం సేకరణపై చీపురుపల్లి ఎడి కోటేశ్వరరావు శిక్షణ కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది ప్రభుత్వం రైతుల నుంచి ధాన్యం సేకరణకు పగడ్బందిగా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ముఖ్యంగా ధాన్యం సేకరణ కనుగోలులో రైతులకు ఎటువంటి ఇబ్బందులూ లేకుండా ప్రభుత్వం వాట్సాప్ మెసేజ్ ద్వారా రైతుల నుంచి ధాన్యం సేకరించాలని సూచించారు. ధాన్యం సేకరణలో వ్యవసాయ శాఖ అధికార్లు, సిబ్బంది అప్రమత్తంగా వ్యవహారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఒ ఎం.పూర్ణిమ, సిఎస్‌డిటి తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ పరిరక్షణే లక్ష్యం

బొబ్బిలి : విద్యారంగ పరిరక్షణకు అధిక ప్రాధాన్యతనిస్తూ ఉపాధ్యాయ సంక్షేమమే లక్ష్యంగా పనిచేయాలని ఎపిటిఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.పద్మావతి కోరారు. సోమవారం స్థానిక ఎపిటిఎఫ్ కార్యాలయంలో జిల్లా గౌరవాధ్యక్షులు బంకురు జోగినాయుడు అధ్యక్షతన ఎపిటిఎఫ్ జోనల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేటికీ విద్యారంగంలో అశాస్త్రీయమైన విధానాలను ప్రభుత్వాలు కొనసాగిస్తూ విద్యను కుంటుపరుస్తున్నాయని విమర్శించారు. రాష్ట్ర అకడమిక్ కన్వీనర్ జెసి రాజు మాట్లాడుతూ విద్యా సంవత్సరం మధ్యలో పని సర్దుబాటును విరమించుకోవాలని డిమాండ్‌చేశారు. ఎల్లయ్య, శ్రీనివాసరావు, లక్ష్మణరావు, రామకృష్ణ, రమేష్, చంద్రనాయుడు, రామమూర్తి పాల్గొన్నారు.

ఒబిసి సాధనే ధ్యేయం

కళింగ కోమటి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోవిందరాజులు

ప్రజాశక్తి - చీపురుపల్లి

రాష్ట్రంలో ఉన్న కళింగ కోమటి కులస్థులకు సంబంధించి ఒబిసి సాధనే ధ్యేయంగా కృషి చేస్తున్నట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బోయన గోవింద రాజులు అన్నారు. సోమవారం స్థానిక వైశ్య వర్తక సంఘం భవనంలో జరిగిన కళింగ కోమటి సంఘం నూతన కమిటీ ఎన్నిక జరిగింది. ఈ సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 2014లో జరిగిన ఎన్నికల ముందు చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం ఏర్పాటైన వందరోజులలో కళింగ కోమటి కులస్థులను బిసి కేటగిరిలో చేర్పించారని తెలిపారు. అయితే రాష్ట్రంలో బిసి కేటగిరీలోనికి చేర్చినప్పటికీ కేంద్రం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలు, ఉద్యోగాలలో అవకాశాలు రావడం లేదన్నారు. కేంద్రంలో కూడా కళింగ కోమటిలను ఒబిసి కేటగిరీలో చేర్పిస్తే కేంద్రం అమలు చేస్తోన్న పథకాలతో పాటు ఉద్యోగాలు, రాజకీయాలలో ప్రాధాన్యతలు కలుగుతాయని అన్నారు. అనంతరం నూతన కమిటీతో ఆయన ప్రమాణ స్వీకారం చేయించారు.

కళింగ కోమటి నూతన అధ్యక్షుడిగా నర్శింగరావు

చీపురుపల్లి మండల కళింగ కోమటి నూతన అధ్యక్షుడిగా పొన్నూరు నర్శింగరావు ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా సుంకరి చంద్రశేఖర్ గుప్తా, పొట్నూరు త్రినాధరావు, కార్యదర్శిగా అందవరపు నగేష్ కుమార్, సహ కార్యదర్శిగా కొత్తకోట సురేష్ కుమార్, కోశాధికారిగా కందుల పుండరీ, సహ కోశాధికారిగా సుంకరి సతీష్‌తో పాటు సభ్యులుగా మరో 12 మంది ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు నర్శింగరావు మాట్లాడుతూ కళింగ కోమటి కులస్థుల సంక్షేమం కోసం కృషి చేస్తానని అన్నారు.కార్యక్రమంలో స్థానిక వ్యాపార వేత్తలు పొట్నూరు ప్రభాకరరావు, టి నీలకంఠేశ్వరరావు, కళింగ కోమటి రాష్ట్ర ఉపాధ్యక్షుడు తంగుడు రామకృష్ణ, అందవరపు హరి, అందవరపు గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాణ స్వీకారం చేస్తున్న కళింగకోమటి సంఘం కార్యవర్గ సభ్యులు

విద్యార్థులకు ఆటల పోటీలు

ప్రజాశక్తి- రేగిడి

స్థానిక శాఖా గ్రంథాలయంలో జాతీయ వారోత్సవాల్లో భాగంగా సోమవారం పిల్లలకు వివిధ రకాల ఆటల పోటీలను నిర్వహించారు. మ్యూజికల్ చైర్ క్రీడా రసవత్తరంగా సాగింది. గెలుపొందిన విద్యార్థులకు ఈనెల 20వ తేదీన ముగింపు కార్యక్రమంలో బహుమతులు అందజేస్తారని నిర్వాహకులు ఈశ్వరరావు తెలిపారు.

పూసపాటిరేగ: స్థానిక శాఖ గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా సోమవారం విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ డ్రాయింగ్ ఉపాధ్యాయుడు ఇనపకుర్తి చిన్న సత్యనారాయణ ఆధ్వర్యంలో పోటీలు జరిగాయి. ఈ సందర్భంగా గ్రంథాలయ నిర్వాహకుడు పి నాగేశ్వరరావు మాట్లాడుతూ వారోత్సవాల సందర్భంగా విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు పోటీలు నిర్వహిస్తున్నామని విజేతలకు ముగింపు రోజున బహుమానాలు అందజేస్తామని చెప్పారు.

నెల్లిమర్ల: జరజాపుపేట గ్రామీణ గ్రంథాలయంలో విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన, డిబెట్ పోటీలను సోమవారం నిర్వాహకులు జె.నారాయణమ్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంఘం ముఖ్య సలహాదారు కడలి ప్రకాశరావు, విశ్రాంతి ప్రధానోపాధ్యాయులు సుంకరి వాసుదేవరావు, సత్య కాన్సెప్ట్ స్కూల్ ఉపాధ్యాయులు పి.సంతోష్ భార్గవి, కె.శ్యామల విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

రేగిడి : చిన్నారులకు మ్యూజికల్ చైర్ నిర్వహిస్తున్న నిర్వాహకులు

డెంకాడ: స్థానిక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో సోమవారం గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లైబ్రేరియన్ మహేశ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న పింఛనుదారులు

ఇపిఎఫ్ పింఛను రూ.9 వేలు ఇవ్వాలి

ప్రజాశక్తి-బొబ్బిలి

ఇపిఎఫ్ కనీస పింఛను రూ.9 వేలు చెల్లించి, డిఎ ఇవ్వాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు, ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు వి.శేషగిరిరావు డిమాండ్ చేశారు. పట్టణంలోని టిఆర్ కాలనీ అంబేద్కర్ విగ్రహం వద్ద సోమవారం పెన్షనర్ల విద్రోహ దినం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులు, ఉద్యోగులు పిఎఫ్ డబ్బులు చెల్లించి భవిష్యత్తు అవసరాల కోసం దాచుకుంటున్నారని తెలిపారు. అటువంటి వారికి పెరుగుతున్న ధరలకు అనుగుణంగా పింఛను ఇవ్వడం లేదని విమర్శించారు. రూ.వెయ్యి నుంచి రూ.3 వేల లోపు మాత్రమే ప్రస్తుతం పింఛను ఇస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కార్మికులు దాచుకున్న డబ్బులకు నెలకు వడ్డీ రూ.51.81 కోట్లు వస్తే పింఛను మాత్రం నెలకు రూ.14.44 కోట్లు మాత్రమే చెల్లిస్తున్నారని తెలిపారు. కార్మికులు పిఎఫ్ సొమ్ము నుంచి వస్తున్న వడ్డీలో మిగులు సొమ్మును ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. పార్లమెంటులో ఎంపిలు ప్రశ్నిస్తే నిధులు లేవని మోడీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం సబబు కాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నెలకు ఒక్కొక్కరికి రూ.5 వేలు చెల్లించే అవకాశం ఉన్నా ఎందుకు చెల్లించడం లేదని ప్రశ్నించారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం స్పందించి పెరుగుతున్న ధరలకు అనుగుణంగా నెలకు పింఛను రూ.9 వేలు చెల్లించి డిఎ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎస్.గోపాలం, పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యులు టి.రమణ, జి.సింహచలం, పి.కృష్ణ, పింఛనర్లు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-బొబ్బిలి రూరల్

మండలంలోని మెట్టవలస సమీపంలో ఉన్న అంధుల పాఠశాలలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. విద్యార్థులకు సిహెచ్‌సి వైద్యులు రవిశంకర్, హెప్సిక, పిరిడి పిహెచ్‌సి వైద్యులు రఘువంశీ వైద్య పరీక్షలు చేశారు. మందులు అందజేశారు. కార్యక్రమంలో ప్యానల్ న్యాయవాది ప్రసన్నకుమార్, సిహెచ్ఒ సరోజిని పాల్గొన్నారు.

కెజిబివి విద్యార్థులకు ఆటల పోటీలు

ప్రజాశక్తి-బొబ్బిలి

స్థానిక కెజిబివి విద్యార్థులకు బాలల దినోత్సవం సందర్భంగా ఐసిడిఎస్ ఆధ్వర్యంలో సోమవారం ఆటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఒ జె.విజయలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు ఆటల్లో ప్రతిభ కనబరచాలన్నారు. కిశోర బాలికలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఆటలు, వ్యాసరచన పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కోమటిపల్లి పాఠశాలలో చదరంగం పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు అరుణకుమారి, ప్రభావతి పాల్గొన్నారు.

సభ్యత్వంపై ఆరా తీస్తున్న బంగార్రాజు

పథకాలపై అవగాహన కల్పించండి

రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ప్రభుత్వ పథకాలపై ప్రజలకు కార్యకర్తలు అవగాహన కల్పించి, వైసిపి చేస్తున్న తప్పుడు ప్రచారాలను తిప్పి కొట్టాలని రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు అన్నారు. పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అందులో భాగంగా ఏర్పాటు చేసిన సభ్యత్వ నమోదును చురుగ్గా చేయాలని పిలుపునిచ్చారు. సోమవారం ఆయన మల్యాడ, జోగిరాజుపేట, అలుగోలు, గుషిణి, సతివాడ గ్రామాలలో పర్యటించి సభ్యత్వాలను పరిశీలించారు. కార్యక్రమంలో పార్లమెంట్ అధికార ప్రతినిధి గేదెల రాజారావు, ఎస్‌సి సెల్ అధికార ప్రతినిధి పోతల రాజప్పన్న తదితరులు పాల్గొన్నారు.

సృజనాత్మకతను వెలికి తీయాలి

ప్రజాశక్తి-విజయనగరంకోట

విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకతను వెలికి తీయడానికి చిత్రలేఖనం వంటి పోటీలు ఉపయోగ పడతా యని గాజులు రేగ నారాయణ పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ మొయిద నారాయణరావు అన్నారు.

చిత్రలేఖనం పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా సోమవారం స్థానిక గాజులు రేగ శాఖా గ్రంథాలయంలో పెయింటింగ్, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో చి చదవడం మాకిష్టం లోగో ట్రీని పెయింటింగ్ వేసి విద్యార్థులు ఆకట్టుకున్నారు. స్థానిక జెడ్‌పి హైస్కూల్ తెలుగు ఉపాధ్యాయుడు శ్రీకర్ , స్థానిక హైస్కూల్, నారాయణ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

యువతి అదృశ్యంపై కేసు నమోదు

ప్రజాశక్తి - భోగాపురం

యువతి అదృశ్యంపై స్థానిక పోలీసులు ఆదివారం రాత్రి కేసు నమోదు చేశారు. మండలంలోని గుడివాడ గ్రామానికి చెందిన చిల్లా ఎర్రయ్యమ్మ తన కుమార్తె ఈనెల 17వ తేదీ మధ్యాహ్నం నుంచి కనబడడం లేదని పోలీసులకు అదే రోజు రాత్రి ఫిర్యాదు చేసింది. ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదని ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు పోలీసులు ఆదివారం రాత్రి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శివ్వాంలో బైక్ చోరీ

ప్రజాశక్తి - వంగర

తన రేకుల షెడ్డులో ఈనెల 17న పార్కింగ్ చేసిన యూనికాన్ బైకు అదే రోజు రాత్రి చోరీకి గురైనట్లు శివ్వాం గ్రామానికి చెందిన ఏనుగుతల వెంకటనాయుడు ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ షేక్ శంకర్ సోమవారం తెలిపారు. బైక్ యజమాని వెంకటనాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

మహారాజశ్రీ విజయనగరం 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు విజయనగరం

OS : 746/2019

Between :

1. దొమాదుల శివ శంకర్
2. ఆల్తి శ్రీను ....Plaintiff

And :

వూటుకూరి వీర్రాజు ......Defendant

To

వూటుకూరి వీర్రాజు, S/o నాగరాజు, R/o డోర్ నెం. 20-22-17, నటరాజ్ కాలనీ, విజయనగరం టౌన్ మరియు జిల్లా.

పై నెంబరు కోర్టునందు వాది దావా నమోదు చేయగా శ్రీ కోర్టువారు వాదిని ఆర్డరు జారీ చేసిన విధంగా ఈ నోటీసు పంపించిడం జరిగింది. ఈ దావా **తే 11-12-2024 ఉదయం 10-30 ని॥ల**కు మీరుగాని, మీ న్యాయవాది గారి ద్వారా గాని పై కోర్టునకు హాజరై మీ వాదనను తెలియజేయవలెను. లేని ఏడల శ్రీ కోర్టువారు మీకు పరోక్షంగా తీర్మానించుదురు. అని యిందుమూలంగా తెలియజేయడమైనది.

కె.రవిబాబు
అడ్వకేట్, విజయనగరం,
సెల్ : 9440343921